క్లుప్తంగా

దాతల సహకారంతో అల్మరాలు


అల్మరాలు ప్రారంభిస్తున్న సలీంబాష

ఉలవపాడు: మండల పరిధిలోని పెదపట్టపు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో అల్మరాలను మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలో ఉపాధ్యాయుడు, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని పెట్టుకునేందుకు ఈ అల్మరాలు వినియోగిస్తారు. మొత్తం రూ.25 వేల వ్యయంతో వీటిని నిర్మించినట్లు ప్రధానోపాధ్యాయుడు సలీంబాష తెలిపారు. అల్మారాలు ఇచ్చిన దాతలకు అభినందనలు తెలియచేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కనిగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ జె.ఉషారాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం(కంప్యూటర్), బీఎస్సీ కంప్యూటర్ కోర్సులకు ప్రవేశాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని కనిగిరి ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో త్వరలో స్మార్ట్‌క్లాస్ రూమ్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ ల్యాబ్, సౌకర్యంతో పాటు, క్రీడా విభాగానికి సంబంధించి జిమ్, టెన్నిస్, ఇతర క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. న్యాక్ సంస్థతో బీ గ్రేడ్ పొందిన ఏకైక డిగ్రీ కళాశాలగా తెలిపారు. డాక్టరేట్స్, నీట్, ఎస్ఎల్ జీటీలలో అర్హత సాధించిన అధ్యాపకులచే బోధన జరుగుతుందన్నారు. స్కిల్ హబ్ వారిచే ఉచిత కంప్యూటర్ శిక్షణ, ప్రత్యేకంగా విద్యార్థినులకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులు జరుగుతున్నట్లు వివరించారు. ఈ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

వరిగడ్డి వాము దగ్ధం

- రూ.40 వేలు నష్టం

గుడ్లూరు: నిప్పంటుకొని వరిగడ్డి వాము దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని పాజర్లలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన కుందిర్తి మునలయ్య తన ఇంటికి కొంచెం దూరంలో వరిగడ్డి వాము వేసుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి వాము దగ్గర మంటలు వస్తుండటంతో గమనించిన చుట్టుపక్కల వారు మునలయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లేసరికి వాము పూర్తి దగ్ధమైంది. ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో వాముకు నిప్పు పెట్టడం వల్లే అది పూర్తిగా తగలబడిపోయిందని మునలయ్య వాపోయాడు. దగ్ధమైన వరిగడ్డి విలువ రూ.40 వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

నేడు, రేపు ఉపాధి హామీ పథకం గ్రామసభలు

సింగరాయకొండ: మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందం నిర్వహించిన సామాజిక తనిఖీపై బుధ, గురువారాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేష్‌కుమారి తెలిపారు. 26వ తేదీ ఊళ్లపాలెం, కనుమళ్లలో 27వ తేదీ మిగిలిన గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. 28వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు అందరూ గ్రామసభల్లో, ప్రజావేదికలో పాల్గొనాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

హనుమంతునిపాడు: హెల్త్ క్లినిక్ హెల్త్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి వైద్య సేవలు అందించాలని డాక్టర్ లక్ష్మీభార్గవి, సీహెచ్ఓ కెవీ చెన్నయ్య అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్ క్లినిక్‌లో ఉన్న ఎంఎల్‌హెచ్‌పీలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

- విద్యుత్ శాఖ ఏఈ, మరో ఇద్దరిపై కేసు నమోదు

ఉలవపాడు: ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఉలవపాడు పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని సుబ్బరాయుడు సత్రం సమీపంలో రొయ్యల చెరువుల వద్ద యజమాని పొంగళ్లు ఏర్పాటు చేసి అందరినీ పిలిచి పార్టీ ఇచ్చారు. ఈ సమయంలో మాట్లాడుకుంటున్నప్పుడు వివాదం ప్రారంభమై విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావును శ్రీనాథ్, రాజు అనే వ్యక్తులు కొట్టారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేశారు. శ్రీనాథ్ అనే వ్యక్తిని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఈపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజిరెడ్డి పేర్కొన్నారు.

కొండపిలో రికార్డు ధర పలికిన పొగాకు


వేలం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

- అత్యధిక ధర కిలో రూ.356

కొండపి(సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం అత్యధిక ధర కిలో రూ.356 పలికిందని, కొండపి బోర్డు చరిత్రలోనే ఇది రికార్డు ధర అని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు గ్రామాలకు చెందిన రైతులు 1254 బేళ్లు తీసుకురాగా 1180 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 74 బేళ్లను తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.315.18 పలికింది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.354

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగవారం నిర్వహించిన వేలంలో గరిష్ఠ ధర రూ.354 పలికింది. కారుమంచి క్లస్టరు గ్రామాల రైతులు 1191 బేళ్లను వేలానికి ఉంచగా 1090 కొనుగోలయ్యాయి. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.291.32 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో విద్యుత్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా విద్యుత్ లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరైనట్లు తెలిపారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు స్థల కేటాయింపు విషయంలో అడ్డు చెప్పకుండా ప్రజలు సహకరించాలన్నారు. అర్బన్ కాలనీలో నిర్మించిన నూతన సబ్‌స్టేషన్ త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించి, పట్టణ, శివారు ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందచేస్తామని తెలిపారు. విద్యుత్ ఏఈ పవన్‌కుమార్, బేరి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


దూబగుంట్లలో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, దాత

పామూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన జరుగుతోందని ఎంపీయూపీ దూబగుంట్ల పాఠశాల హెచ్‌ఎం జేవీఎస్ ప్రసాద్ అన్నారు. మండలంలోని దూబగుంట్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దాత వెలుగు శ్రీనివాసులు తన సొంత నిధులతో సమకూర్చిన నోట్‌పుస్తకాలు, పలకలు, జామెంట్రీ, పెన్నులు, పెన్సిల్స్ తదితర విద్యా సామగ్రిని పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి ఇష్టంతో విద్యనభ్యసించాలన్నారు. పుస్తకాల దాత శ్రీనివాసులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. టి.సత్యనారాయణ, సీహెచ్.మోహన్‌రావు, షేక్.మెహరున్నీసాబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లలిత

హనుమంతునిపాడు: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృ ష్టి సారించాలని ఎంపీడీఓ కె.లలిత కార్యదర్శులకు సూచించారు. స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సాగర్ తాగునీరు సరఫరా కాని గ్రామాల్లో మరమ్మతులకు గురిఐన బోర్లు, తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయించాలన్నారు. సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహించి తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. దోమలు నివాస స్థావరాలు ఏర్పాటు చేసుకోకుండా మురుగు లేకుండా పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. ఏఓ కేవీ కృష్ణారావు, ఈఓఆర్డీ షేక్ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీవారి కల్యాణం


పత్యేక అలంకరణలో శ్రీవారు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్నవెంకటేశ్వర స్వామి ఆలయంలో షష్ఠమ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం భూనీలా సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు స్వామివారిని హనుమంత వాహనంపై ఊరేగించారు. అనంతరం 11 గంటలకు ఆలయ అర్చకులు అరుణ్‌స్వామి ఆధ్వర్యంలో అర్చకులు ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రతిష్ఠించి వివిధ రకాల ఆభరణాలు, పూలతో అలంకరించి కల్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ టీపీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి కొండలరావు, అదనపు కార్యదర్శి నిట్టూరి రమేష్, కోశాధిగారి పిచ్చిరావు, ప్రతినిధులు రావిపాటి రాజా, విట్టా వెంకటేశ్వర్లు, ఆర్ రామారావు, టి.నరసింహారావు పాల్గొన్నారు.


గోవింద నామస్మరణ చేస్తున్న భక్తులు

గది కూల్చివేతపై ఆగ్రహం


కూల్చివేసిన గది శిథిలాలు

సీఎస్‌పురం(పామూరు): సమాచారం లేకుండా రేకులగదిని జాతీయ రహదారి నిర్మాణంవారు మంగళవారం కూల్చివేయడంపై బాధితునితోపాటు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బాధితులు చెప్పిన సమాచారం మేరకు మండలంలోని కోవిలంపాడులో రహదారిపక్కన గత కొంతకాలంగా గ్రామానికి చెందిన గఫూర్ అనే వ్యక్తి రేకులగది వేసుకుని చిరువ్యాపారం చేసుకుని జీవిస్తున్నాడు. కాగా అదేప్రాంతంగుండా వెళ్లే 167బీ జాతీయ రహదారి వెళ్తుండగా రహదారి నిర్మాణం చేపట్టిన వారు తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, సర్వే చేయించకుండా అక్రమంగా తమ గదిని కూల్చివేసి నష్టం కలిగించారని వాపోతున్నారు. దీనిపై తాము రెవెన్యూ సిబ్బందిని అడిగామని ఎటువంటి సర్వేచేయలేదని, ఆక్రమణలు తొలగించాలని చెప్పలేదని..మరో రెండురోజుల్లో సర్వేచేస్తామని చెప్పామన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి 19వ ప్రతిష్ఠ మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

మార్కాపురం: మార్కాపురం పట్టణ నడిబొడ్డున ఉన్న అయ్యప్పస్వామి దేవస్థాన 19వ ప్రతిష్ఠ వార్షికోత్సవం ఈనెల 16 నుంచి ప్రారంభమై మంగళవారంతో ముగిసింది. ఉదయం 6 గంటలకు అయ్యప్పస్వామికి గణపతి హోమం, అనంతరం మహాకళాభిషేకంలో భాగంగా వివిధ రకాల పండ్ల రసాలు, పాలు, తేనే, పెరుగుతో అభిషేకం అనంతరం నగరోత్సవాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు తాడువాయి గోపాలమల్లిఖార్జునరావు, కార్యదర్శి పడుచూరి కృష్ణయ్య, కోశాధికారి పీవీ సత్యమోహన్, ఉపాధ్యక్షుడు గుంటక వెంకటరెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న భక్తులు

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలకు పంపాలి


కంబాలదిన్నెలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పామూరు: బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు పనికి పంపకుండా వారిని పాఠశాలకు పంపాలని కంబాలదిన్నె ఎంపీపీఎస్(హెచ్) హెచ్‌ఎం కె.గోవిందమ్మ, సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండలంలోని కంబాలదిన్నె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నేను బడికిపోతా కార్యక్రమం, అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్య ఆవశ్యకతను వివరిస్తూ పాఠశాల వద్ద నుంచి కంబాలదిన్నెలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ విద్య పూర్తిచేసుకుని ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతితో చేరుతున్న విద్యార్థులకు అంగన్‌వాడీ గ్రాడ్యేయేషన్ సందర్భంగా ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందించే పౌష్టికాహారం, విద్యాసామగ్రి వివరాలు వివరించారు. గ్రామస్తులు పిచ్చాల తిరుపతిరెడ్డి, నక్కా మాల్యాద్రి, ఓరుగంటి సుబ్బమ్మ, గోళ్ల లక్ష్మీరాజ్యం, పి.సంపూర్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, మహిళా కార్యదర్శి ఎస్.శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

- బోల్తా పడిన ట్రాక్టర్
- ముగ్గురికి తీవ్రగాయాలు


ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన లారీ ముందుభాగం


క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

టంగుటూరు: ముందు వెళుతున్న రైల్వే కూలీల ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. జాతీయ రహదారి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీమకుర్తి నుంచి చెన్నై వెళ్తున్న లారీ టోల్ ప్లాజా సమీపంలోకి రాగానే ముందు వెళుతున్న ట్రాక్టర్‌ని ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా ట్రాక్టర్ బోల్తా పడటంతో అందులో ఉన్న ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.


ప్రమాదంలో బోల్తాపడిన ట్రాక్టర్

గరుడ వాహనంపై తిరుమలనాథస్వామి


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో వెలసిన గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగు రంగు పూలతో అలంకరించారు. పగలు ఉత్సవం పల్లకిలో సోమవారం రాత్రి ఉత్సవం గరుడ వాహనంపై కొలువు దీర్చారు. ఆలయ మాఢ వీధులు, ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కోరిన కొర్కెలు తీర్చాలని మొక్కలు తీర్చుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయం ప్రాంగణంలో ఆంజనేయస్వామి, నవగ్రహాలు, నాగయ్య, విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. చట్లమిట్ల గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి కందుల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. బ్రహ్మణ, ఆర్యవైశ్య, రెడ్ల, యాదవ సత్రాల్లో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం రథోత్సవం సందర్భంగా రాత్రి రెండు ఎలక్ట్రికల్ ప్రభలు, డ్రామాలు, కోలాటం ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కేజీబీవీలో దోమల నివారణకు చర్యలు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కస్తూర్బా గాంధీ పాఠశాలలో కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో వైద్య సిబ్బంది మలాథియాన్ పిచికారీ చేశారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టినట్లు సబ్ యూనిట్ అధికారి నాగేంద్రరెడ్డి పేర్కొన్నారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ కాలేషా, అనంతలక్ష్మి, మెడికల్ సిబ్బంది పి అనురాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.